

కల్లూరు సమీపంలో రోడ్డు దాటుతున్న ఏనుగుల గుంపు

క్షణ క్షణం...

భయం..భయం..!

● కల్లూరులో హల్‌చల్ చేసిన 16 ఏనుగుల గుంపు

● అయ్యావాండ్లపల్లి వద్ద పంటలపై స్వైరవిహారం

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు ఒక వైపు 16 ఏనుగుల ఘీంకారాలు.. మరో వైపు ఏనుగులను చూసేందుకు గుమిగూడిన జనం... ఇంకోవైపు రోడ్డుకు ఇరువైపులా బందోబస్తు చేపడుతూ ఏనుగులను పంట పొలాల నుంచి అడవి వైపు మళ్లించేందుకు అటవీశాఖ అధికారుల, పోలీసుల కృషి .అయితే ఏనుగులు మాత్రం గ్రామాల వైపు వెళ్లేందుకే ప్రయత్నించడంతో రెండు గంటల పాటు ఉత్కంఠ నెలకొంది.చివరకు ఏనుగుల గుంపు అడవి వైపు అడుగులు వేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని గుట్టమీదపల్లి వద్ద శుక్రవారం ఉదయం చోటుచేసుకుందీ ఈ సంఘటన . ఉదయం 6 గంటల సమయంలో పాళెం పంచాయతీ కొంగరవారిపల్లి వద్దకు 16 ఏనుగుల గుంపు చేరుకుంది. అక్కడకు చేరుకున్న అటవీశాఖ అధికారులు టపాకాయలు పేల్చి బెదరగొట్టడంతో ఇర్లపాళెం, ఇండియన్ గ్యాస్ గోడౌన్, అజీజ్ కుంట మీదుగా ఉదయం 7గంటల సమయంలో పులిచెర్ల రోడ్డులోని గుట్టమీదపల్లి సమీపంలోని హంద్రీ-నీవా కాలువ వద్దకు ఏనుగులు చేరుకున్నాయి.ఈ సమాచారం అందుకున్న చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రహదారిపైకి చేరుకున్నారు. రహదారిపైకి చేరుకున్న మనుషుల వాసన పసిగట్టిన ఏనుగుల గుంపు ఒక్కసారిగా ఘీంకారాలు చేశాయి. ఏనుగుల అరుపులతో ప్రజలూ కేకలు పెట్టారు. ఫారెస్ట్ రేంజర్ థామస్‌కుమార్, కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు గుట్టమీదపల్లి వద్దనున్న రోడ్డుపైకి చేరుకొని వాహనాలు, మనుషులు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. ఏనుగుల గుంపును పులిచెర్ల రోడ్డు దాటించి అడవి వైపు మళ్లించేందుకు ప్రయత్నం చేశారు. అయితే రహదారిపై ఉన్న ప్రజలను గమనించిన ఏనుగుల గుంపు అడవి వైపు కాకుండా గ్రామాల వైపు వెళ్లేందుకు చూడడంతో ఆందోళన చెందిన ఫారెస్ట్ రేంజర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఏనుగుల గుంపు వెనుకవైపు చేరుకున్న సిబ్బంది టపాకాయలు పేల్చడంతో చివరకు ఏనుగులు అడవివైపు వెళ్లేందుకు అడుగులు వేశాయి. గుట్టమీదపల్లి వద్ద పులిచెర్లకు వెళ్లే రోడ్డును దాటుకొని పాళెం మీదుగా తూర్పు అటవీ విభాగంలోకి చేరుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



ఏనుగులను అడవి వైపు మళ్లించేందుకు సూచనలిస్తున్న ఫారెస్ట్ రేంజర్ థామస్‌కుమార్

రాత్రివేళ మళ్లీ పల్లెల వైపు అడుగులు

పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద ఉన్న అటవీ ప్రాంతం పరిధిలోని సూరప్ప చెరువు వద్ద శుక్రవారం పగలంతా తిష్ట వేసిన ఏనుగుల గుంపు సాయంత్రం చీకటి పడుతుండగా మరోసారి పల్లెల వైపు అడుగులేశాయి. సూరప్పచెరువు నుంచి దేవళంపేట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ సమీపానికి చేరుకున్నాయి. అక్కడి నుంచి కల్లూరు- పులిచెర్ల రోడ్డును దాటుకుని వంకాయలపాటివారిపల్లి సమీపంలోని మామిడితోటలోకి రాత్రి 10 గంటలకు చేరుకున్నాయి. గురువారం రాత్రి పంటలను ధ్వంసం చేసిన అయ్యావాండ్లపల్లి పంచాయతీ వైపు ఏనుగులు వెళుతున్నాయి. సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసిన ఎఫ్ఆర్‌ఓ థామస్‌కుమార్, ఎఫ్ఎస్ఓ మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీఓ మున్నా ఏనుగుల గమనాన్ని పరిశీలిస్తున్నారు. వీకేపల్లి, పెద్దబెస్తపల్లి, అయ్యావాండ్లపల్లి, నల్లగుట్టపల్లి, యర్రంవాడ్లపల్లి ప్రజలు రాత్రంతా ఇళ్లనుంచి బయటకు రావద్దని ఫారెస్ట్ అధికారులు సూచించారు.

పలువురి పంటలకు నష్టం

శుక్రవారం వేకువజామున అయ్యావాండ్లపల్లి పంచాయతీలో వరి పంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేసింది. ముందుగా యర్రంవాండ్లపల్లిలోని తులసీరామ్‌కు చెందిన ఎకరా వరిపంటను, కౌలు రైతు నారాయణకు చెందిన అర ఎకరా వరిపంటను ధ్వంసం చేశాయి. సమీపంలోని అయ్యావాండ్లపల్లికి చెందిన ధనంజయ రెండు ఎకరాల వరిపంటను,చిన్నమునస్వామికి చెందిన అర ఎకరా వరిపంటను, యల్లప్పకు చెందిన అర ఎకరా వరిపంటను, రెడ్డెప్పకు చెందిన అరెకరా వరిపంటను ధ్వంసం చేశాయి. నల్లగుట్టపల్లిలోని ఖగేంద్రనాథరెడ్డికి చెందిన అర ఎకరా వరిపంటను కూడా ధ్వంసం చేశాయి.శుక్రవారం రాత్రి అయ్యావాండ్లపల్లి పంచాయతీ వైపు ఏనుగులు వెళుతున్నాయని తెలియడంతో ఈసారి ఎవరి పంటలను మరోసారి ధ్వంసం చేస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పశుగణన ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 21వ అఖిల భారత పశుగణన జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని అన్ని గ్రామీణ పశువైద్యశాలల నుంచి ప్రారంభమైంది. కుప్పం కడా కార్యాలయం నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ విద్యాధరి, జిల్లా కేంద్రంలో ఎస్పీ మణికంఠ, చిత్తూరులో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, బంగారుపాళ్యం మండలం నలగాంపల్లెలో ఎమ్మెల్యే మురళీమోహన్, పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్, ఇతర ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు గణన కొనసాగనుంది. 700 గ్రామ పంచాయతీలు 988 రెవెన్యూ గ్రామాలు, వార్డుల్లోని 4,60,076 నివాసాల్లో పశుగణన చేపట్టనున్నారు. 384 మంది గణన కర్త(ఎన్యుమరేటర్లు)లు, 67 మంది సూపర్‌వైజర్లు పాల్గొననున్నారు. గేదెలు, ఆవులు, కోళ్లు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు తదితర పశు జాతులను నమోదు చేస్తారు. పర్యవేక్షణకు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులను పశుసంవర్థక శాఖ అధికారులు నియమించారు.



కుప్పం కడా కార్యాలయంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు



పార్టీ శ్రేణులు

సంక్షేమానికి పెద్దపీట

● నేటినుంచి టీడీపీ సభ్యత్వ నమోదు

● ప్రమాద బీమా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు

చిత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శనివారం నుంచి అధిష్ఠానం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. ఈ విషయమై శుక్రవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో నేతలకు దిశానిర్దేశం చేశారు.ఈ నేపథ్యంలో జిల్లాలో సభ్యత్వాలను రికార్డుస్థాయిలో నమోదు చేసేందుకు ఎమ్మెల్యేలు, నాయకులు విస్తృత ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం ఆయా నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించనున్నారు. ఇప్పటికే పార్టీ నాయకులతో, కార్యకర్తలతో వరుసగా సమావేశాలు ఏర్పాటు చేసుకున్న ఎమ్మెల్యేలు నమోదుపై అవగాహన కల్పించారు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ ఓ అడుగు ముందుకేసి అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించిన నాయకులకు ఆకర్షణీయమైన బహుమతుల్ని అందిస్తానని కూడా ప్రకటించారు.

● లక్ష టార్గెట్ పెట్టుకున్న ఎమ్మెల్యేలు..

ప్రతి నియోజకవర్గంలో లక్షమందితో సభ్యత నమోదు చేయిస్తామని టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు అంటున్నారు. నిర్దేశించిన రెండు నెలల గడువులో ఆ స్థాయిలో కాకపోయినా 60 వేలకు తగ్గకుండా సభ్యత్వ నమోదు చేయించే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో 2019లో 70 వేల సభ్యత్వాల్ని నమోదు చేసిన నేపథ్యంలో ఈసారి లక్షకు తగ్గకుండా ఉండేలా ప్లాన్ చేసుకున్నారు. ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గంలో 80 వేలు, తక్కువగా ఉన్నచోట 50వేల నుంచి 60 వేల మంది చొప్పున నమోదు చేసినా.. మొత్తంగా జిల్లాలో 5 లక్షల సభ్యత్వాలను నమోదు చేసే అవకాశాలున్నాయి.

● ఈసారి సభ్యత్వం పెరిగే అవకాశాలు

గతంలో సభ్యత్వం ఉన్న కార్యకర్త/నాయకుడు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.2 లక్షలుగా ఉన్న బీమాను ఇప్పుడు రూ.5లక్షలకు పెంచారు. అంతేకాకుండా ఆ కుటుంబ సంక్షేమ బాధ్యత (విద్య, వైద్యం) కూడా పార్టీయే చూసుకుంటుందని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అంతేకాకుండా సాధారణ మరణానికీ మట్టి ఖర్చుల పేరుతో రూ.10వేల తక్షణ సాయం అందించనున్నారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రకటించిన క్రమంలో సభ్యత్వ నమోదు ఈసారి పెరిగే అవకాశాలున్నాయి. దీంతో పాటు ఈసారి కొత్తగా శాశ్వత సభ్యత్వాన్ని తీసుకొచ్చారు. రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వాన్ని పొందవచ్చు.నియోజకవర్గానికో 20మంది అయినా శాశ్వత సభ్యత్వాన్ని తీసుకోవచ్చని భావిస్తున్నారు.



● కుప్పంలో ఆనవాయితీగా..

ఎన్నికల సమయంలో చంద్రబాబు నామినేషన్ పత్రాలను కుప్పం మున్సిపాలిటీ పరిధిలో వున్న లక్ష్మీపురంలోని వరదరాజస్వామి ఆలయంలో పూజ చేసిన తర్వాత ఆర్వోకు అందిస్తారు. నారా లోకేశ్ తన యువగళం పాదయాత్రను కూడా అక్కడి నుంచే ప్రారంభించారు. ఇక ఎన్నికల ప్రచారాన్ని కమతమూరు గ్రామం నుంచి ప్రారంభిస్తారు. యువగళం ప్రారంభమైన రోజు కూడా బహిరంగ సభను కమతమూరులోనే ప్రారంభించారు. ఇప్పుడు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా కమతమూరులోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. శనివారం ఈ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక నాయకులు ప్రారంభించనున్నారు. 2014లో 65 వేలు, 2019లో 70 వేలమందితో సభ్యత్వ నమోదు చేయగా.. ఈసారి లక్షకు ఏమాత్రం తగ్గకుండా నమోదు చేసేందుకు ప్లాన్ చేసుకున్నారు.

ఏ ఎమ్మెల్యే ఎక్కడినుంచి ప్రారంభిస్తారంటే..

సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయా ఎమ్మెల్యేలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని శనివారం నుంచి ప్రారంభిస్తున్నారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి గంగవరం మండలం పత్తికొండ గ్రామంలో ప్రారంభించనున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ శనివారం ఉదయం 8 గంటలకు మురకంబట్టు, 11గంటలకు బీఎస్‌ఆర్‌పేట, 3 గంటలకు గుడిపాలలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటారు. పూతలపట్టు మండలంలోని కమ్మగుట్టపల్లె, వడ్డేపల్లె, పాలకూరు, పూతలపట్టు, వావిల్‌తోట, బండపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే మురళీమోహన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు.కార్వేటినగరం, ఎస్‌ఆర్‌పురం, జీడీనెల్లూరు మండలాల్లో జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లో పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సభ్యత్వ నమోదు కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విదేశాల్లో ఉండడంతో నగరి మండలంలోని మాగాడులో స్థానిక పార్టీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.కాగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చిత్తూరు సమీపంలోని బీఎస్‌ఆర్‌పేట, గుడిపాల ప్రాంతాల్లో శనివారం జరిగే సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు.

టీడీపీ నాయకుడిపై 'వైసీపీ' దాడి

పాలసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజుపై వైసీపీ నాయకులు దాడి చేశారు. ఎస్‌ఐ భారతి తెలిపిన వివరాల మేరకు.. శేఖర్‌రాజు బలిజకండ్రిగ నుంచి తన స్వగ్రామమైన వనదుర్గాపురానికి గురువారం సాయంత్రం ద్విచక్రవాహనంపై బయల్దేరారు. వైసీపీకి చెందిన గురుప్రసాద్, శరవణకుమార్ బలిజకండ్రిగ వద్ద ఆయన్ను అటకాయించి.. ఆయన్ను దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడినవారు పరారీలో ఉన్నారని ఎస్‌ఐ తెలిపారు. కాగా శేఖర్‌రాజుపై దాడిచేసిన నిందితులను అరెస్టు చేయకుండా పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారంటూ టీడీపీ నాయకులు శుక్రవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటపాటు ధర్నా చేశారు. వైసీపీ నాయకులకు అనుకూలంగా ఎస్‌ఐ పనిచేస్తున్నారని ఆరోపించారు. అనంతరం టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడొచ్చి విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళతామని చెప్పడంతో విరమించారు. నాయకులు శీనురాజు, సాయిరాజు, సాంబశివన్, తంగరాజ్, వాసుయాదవ్, కృష్ణయ్య, ఏయిమలై తదితరులు పాల్గొన్నారు.



పాలసముద్రం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

చిరుత మృతి కేసులో ఐదుగురి అరెస్టు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిరుతపులి మృతి కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీఎఫ్‌వో భరణి తెలిపారు. శుక్రవారం రాత్రి అటవీశాఖ పశ్చిమ విభాగం కార్యాలయంలో వివరాల మీడియాకు తెలిపారు. అటవీ సెక్షన్ అధికారి గిరికి అందిన సమాచారంతో బంగారుపాళ్యం మండలం సీజేఎఫ్ఎస్ కాలనీకి చెందిన కె.వినాయకం విచారించగా, కొందరి పేర్లు చెప్పాడు. వారిని అదుపులోకి తీసుకుని చిరుత గోర్లతో కూడిన నాలుగు పాదాలు, ఓ దంతాన్ని స్వాధీనం చేసుకుని విచారణ చేశారు. అనంతరం బంగారుపాళ్యం మండలం వెలుతురుచేనుకు చెందిన ఎన్.ధర్మయ్య, మణికంఠ ప్రోద్బలంతో ఈ నేరంలో పాల్గొన్నట్లు కె.రాజామణి, ఎన్.మాణిక్యం తెలిపారు. ఐదుగురూ నేరం అంగీకరించారు. విద్యుత్ తీగలను ఉపయోగించి చిరుతను చంపి, కత్తితో నాలుగు పాదాలు నరికి తీసుకువెళ్లినట్లు తేలడంతో నిందితులను కోర్టులో హాజరుపరిచారు. వీరికి న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు డీఎఫ్‌వో వివరించారు. పశ్చిమ ఎఫ్ఆర్వో బాలక్రిష్ణారెడ్డి, డీఆర్వో ఆనందరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న అటవీ శాఖ అధికారులు

ట్రెండింగ్‌లో
'చిత్తూరు అబ్బాయి'



● సరదాగా ఇన్‌స్టాగ్రామ్ ఛానెల్ ప్రారంభం

● లక్షల వ్యూయర్స్‌తో దూసుకుపోతున్న విఘ్నేష్

9

కాణిపాకంలో ఖోఖో సందడి



మెరిసిపోతున్న రాజగోపురం



రంగు రంగుల విద్యుద్దీప కాంతులతో తిరుపతిలోని గోవింద రాజస్వామి ఆలయ రాజగోపురం శుక్రవారం రాత్రి మెరిసిపోయింది. దీపావళి వేడుకల్లో భాగంగా ఆలయంలో ఈనెల 30, 31 తేదీల్లో విశేష పూజలు, దీపావళి ఆస్థానం నిర్వహించనున్నారు.
ఈ నేపథ్యంలో విద్యుద్దీపాలతో ఆలయాన్ని, గోపురాలను టీటీడీ అలంకరించింది. ఠీవిగా నింగిలోకి చూస్తున్నట్లుగా ఉండే ఈ గోపురం.. రంగురంగుల కాంతులతో మెరిసిపోతూ నగరవాసులను, యాత్రికులను అకట్టుకుంటోంది.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి

రైతు నేస్తాలు



చల్లని గాలులు.. ప్రకృతి సోయగాల నడుమ పచ్చటి పొలాల్లో పక్షులు కిలకిలరావాలతో సందడి చేస్తున్నాయి. తీర ప్రాంత గ్రామమైన దామరాయి వద్ద వరిపైరుకు నష్టం కలిగించే కీటకాలను తింటూ.. చక్కర్లు కొడుతున్నాయి. ఈ సీజనైతే చాలు.. రైతన్నలకు నేస్తాలుగా ఈ పక్షులు పంట పొలాలపై ఎగురుతూ, అటు వెళ్లేవారికి కనువిందు చేస్తుంటాయి.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి


ఆనంద నిలయం కథ

ప్రత్యేక కథనం తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుమల అనగానే వెలుగులీనే బంగారు గోపురం గుర్తొస్తుంది. దీనిని 'ఆనంద నిలయ విమానం' అంటారు. బంగారు తాపడపు కవచాలలో ఒదిగిన ఈ గోపురాన్ని ఎప్పుడు నిర్మించారనే ఆధారాల్లో స్పష్టత లేదు కానీ, బంగారు తాపడపు పనులు ఎప్పుడెప్పుడు జరిగాయో శాసన లిఖితమై ఉంది. 12, 13 శతాబ్దాల కాలంలో తిరుమల ఆలయ నిర్మాణ సమయంలో ఈ గోపురానికి 'విమానం' అనే మాట తొలిసారి వినిపించింది అంటారు. ఈ మూడంతస్తుల గోపురంలో దిగువన ఉండే రెండంతస్తులు దీర్ఘచతురస్రాకారంలో ఉంటాయి. చివరి అంతస్థు వర్తులాకారంగా ఉంటుంది. వేసర శైలిలో నిర్మించిన ఈ గోపురం మీద అసంఖ్యాక శిల్పాలుంటాయి. తొలి అంతస్తులో మాత్రం లతలు, మకరతోరణాలు మాత్రమే ఉంటాయి. రెండో అంతస్తులో వివిధ భంగిమల్లో 40 శిల్పాలుంటాయి. ఈ అంతస్తులోనే వాయవ్యంలో విమాన వేంకటేశ్వరుడి ప్రతిమ ఉంటుంది. మూడో అంతస్తులో మహాపద్మంతో పాటు 20 ప్రతిమలు ఉంటాయి. నాలుగు మూలల్లో 8 సింహాలుంటాయి. చిలకలు, లతలు, హంసలతో ఈ వర్తులాకారపు శిఖరగోపురం ఆకర్షణీయంగా ఉంటుంది.

భూతలం నుండి బంగారు కలశం దాకా ఆనందనిలయ విమానం ఎత్తు 65 అడుగుల 2 అంగుళాలు.



హైదరాబాదు మ్యూజియంలో ఉన్న తిరుమల ఆలయ సముదాయాల పాతచిత్రం

ఆనందనిలయం బొమ్మతో 2002లో తపాలాశాఖ ప్రత్యేక స్టాంపును కూడా విడుదల చేసింది.

- క్రీ.శ.839లో పల్లవరాజు విజయదంతి విక్రమవర్మ ఆనంద నిలయ విమానానికి స్వర్ణకవచం ఏర్పరచాడు.
- క్రీ.శ.1262లో జాతవర్మ సుందరపాండ్య దేవుడు కూడా స్వర్ణ కవచాన్ని సమర్పించాడు.
- క్రీ.శ.1359 జూలై 6న సాళువ మంగిదేవ మహారాజు ఆనంద నిలయ విమానంపై వున్న పాత కలశాన్ని తీసివేసి కొత్త బంగారు కలశాన్ని ప్రతిష్ఠించాడు.
- క్రీ.శ.1417లో విజయనగర అమాత్యుడు చంద్రగిరి మల్లన ఆనంద నిలయ విమాన జీర్ణోద్ధరణ చేశాడు.
- క్రీ.శ.1518 సెప్టెంబర్ 9న విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు 30 వేల బంగారు వరహాలతో ఆనంద నిలయ విమానానికి బంగారు మలాము చేయించాడు. ఆ తర్వాత వీరనరసింగదేవ యాదవరాయలు కూడా తన ఎత్తు బంగారాన్ని తులాభారం వేసుకుని, ఆ బంగారంతో ఆనందనిలయ విమానంతో పాటు బంగారు వాకిళ్లకు కూడా బంగారు పూత పూయించాడు.
- క్రీ.శ.1630లో కంచికి చెందిన కోటి కన్యాదానం తాతాచార్యులు ఆనందనిలయ విమానానికి బంగారు మలాము చేయించాడు.
- క్రీ.శ.1908 సెప్టెంబర్ 30న మహంతు ప్రయాగ దాసుకు సోదర శిష్యుడైన అధికారి రామలక్ష్మణదాసు ఆనందనిలయ విమానంపై బంగారు కలశాన్ని ప్రతిష్ఠించాడు.
- 1958 ఆగస్టు 18 నుండి 27 వరకు పదిరోజులపాటు ఆనందనిలయ విమాన మహాసంప్రోక్షణ జరిగింది. ఆనందనిలయం మరమ్మతులు జరిగాయి. చెలికాని అన్నారావు సారథ్యంలో జరిగిన ఈ పనులకు 12 వేల తులాల బంగారం వాడారు.
- 1964లో అష్టబంధన మహాసంప్రోక్షణం జరిపారు.

'అమెరికా' ప్రమాద మృతులకు
కన్నీటి వీడ్కోలు





అమెరికా నుంచి వచ్చిన మృతదేహాలు (ఇన్‌సెట్లో) సాయితేజారెడ్డి, హరితారెడ్డి ఫైల్‌ఫొటో

కేవీబీపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆ రెండు కుటుంబాలు తమ పిల్లల మృతదేహాల కోసం పది రోజులుగా కన్నీరు మున్నీరుగా విలపిస్తూ.. ఎదురుచూశాయి. శుక్రవారం సాయితేజారెడ్డి, హరితారెడ్డి దంపతుల మృతదేహాలు రాగానే వీరి కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. కేవీబీపురం మండలం ఆదరంలో బంధుమిత్రులు, స్థానికుల కన్నీటి వీడ్కోలు నడుమ ఆ దంపతులకు అంత్యక్రియలు జరిగాయి. ఆదరం గ్రామానికి చెందిన సాయితేజారెడ్డి.. తొట్టంబేడు మండలానికి చెందిన హరితారెడ్డికి 2022లో వివాహమైంది. వీరు అమెరికాలోని టెక్సాస్‌లో స్థిరపడ్డారు. స్నేహితులతో కలిసి విహార యాత్రకు వెళ్లి వస్తుండగా.. ఈ నెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో హరితారెడ్డి, మరో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. సాయితేజారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 15న అసువులు బాసిన విషయం తెలిసిందే. సాయితేజారెడ్డి, హరితారెడ్డి మృతదేహాలను శుక్రవారం స్వగ్రామమైన ఆదరానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విషాదం నెలకొంది.



రోదిస్తున్న సాయితేజారెడ్డి తల్లి



హరితారెడ్డి తల్లి

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి



ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహ పూర్వకంగా మెలగాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. తిరుపతి మహిళా వర్సిటీ సావేరి అతిథి గృహంలో శుక్రవారం అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, తిరుపతి, తిరుమల, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి సబ్ డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిర్యాదులపై నాణ్యమైన దర్యాప్తు జరిపి, బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉంటుందన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. గంజాయి మూలాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. విక్రేతలు, వినియోగదారులు, సూత్రధారులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీపావళి, కార్తీక మాసోత్సవాలు రానుండడంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీఐలు, ఎస్‌ఐలు గ్రామాల్లో పర్యటించి సైబర్ నేరాలు, 1930పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, నాగభూషణరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయి కేసులో బీటెక్ విద్యార్థి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని శుక్రవారం తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.... రూరల్ మండలం పేరూరు శ్మశాన వాటిక వద్ద ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. సీఐ చిన్నగోవిందు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూసి ఆ ముగ్గురు పారిపోవడానికి ప్రయత్నించారు. పేరూరుకు చెందిన బీటెక్ విద్యార్థి బండారి చిరంజీవిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఇద్దరు పరారయ్యారని సీఐ చెప్పారు.

కాంట్రాక్టర్ల డిష్యుం...డిష్యుం

- తిరుపతి కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఘటన
- 'టెండరు సిండికేట్' వ్యవహారమే కారణమా?

తిరుపతి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఓ కాంట్రాక్టర్‌పై మరో కాంట్రాక్టరు దాడికి పాల్పడ్డాడు. టెండర్ సిండికేట్ వ్యవహారంలో మొదలైన గొడవ దాడికి దారితీసినట్టుగా తెలుస్తోంది. తాను ఆన్‌లైన్ టెండర్లో పాల్గొన్నందుకు సహచర కాంట్రాక్టర్ చంద్ర తనపై దాడి చేశారంటూ కమిషనర్ ఎన్.మౌర్యకు కాంట్రాక్టర్ ఎ.వి.చలపతి రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎస్పీకి ఫిర్యాదు చేయాలని దీనిపై కమిషనర్ స్పందించినట్టు తెలిసింది. దాడివెనుకగల పూర్వాపరాలను పరిశీలిస్తే.. కార్పొరేషన్ పరిధిలో 44 అభివృద్ధి పనులకు గాను గత నెల 30న ఆన్‌లైన్ టెండర్లను పిలిచారు. ఈనేపథ్యంలో పలువురు కాంట్రాక్టర్లు వివిధ పనులకు ఆన్‌లైన్లో టెండర్లు దాఖలు చేశారు. ఇటీవల ఓ అధికార పార్టీ నాయకుడు కాంట్రాక్టర్లను పిలిచి సమావేశం ఏర్పాటుచేసినట్టు తెలిసింది. పనులన్నీ ఒకరికే కాకుండా అందరూ సమానంగా తీసుకుని 'సిండికేట్ సిద్ధాంతాలను పాటించాలని హితవు పలికినట్టు తెలిసింది. తన లాభాపేక్ష లేకుండా చెప్పిన మాటలకు కాంట్రాక్టర్లు కూడా రింగ్‌గా మారేందుకు దాదాపుగా అందరూ అంగీకరించినట్టు సమాచారం. అప్పటికే దాఖలైన టెండర్లను ఈనెల 17న తెరవాల్సి ఉన్నప్పటికీ వాయిదా వేసుకుంటూ వచ్చారు. కాంట్రాక్టర్లలో కొందరు లీడ్ తీసుకుని 44 పనులకు ఎవరెవరు టెండర్లు వేశారో పేర్లు తెలుసుకుని వాళ్లను బిడ్డింగ్ నుంచి తప్పించే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం టెక్నికల్ బిడ్ ఓపెన్ చేస్తారన్న సమాచారంతో పలువురు కాంట్రాక్టర్లు కార్యాలయానికి చేరుకున్నారు. ఇదివరకే దాఖలైన టెండర్లపై సిండికేట్ అయ్యేందుకు చలపతి రెడ్డి అంగీకరించకపోవడంతో అతడిపై దాడికి దిగినట్టుగా తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో తీవ్ర చర్చకు దారితీసింది. కాంట్రాక్టర్లు రోడ్డున పడడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. సాయంత్రం పలు ఆన్‌లైన్ టెండర్లను తెరుస్తున్నట్టు సమాచారం. అయితే అన్ని పనులకు దాఖలైన టెండర్లను తెరవకుండా కొన్నింటినే ఓపెన్ చేయడంపై పలువురు కాంట్రాక్టర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పశుగణన ప్రారంభం



తిరుపతి రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించి పశుగణన సర్వేని శుక్రవారం తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీ పాపిరెడ్డిపల్లెలో కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ప్రారంభించారు. 2025 ఫిబ్రవరి 28వరకు జరిగే ఈ సర్వేలో 16 రకాల జంతువులను గణన చేయనున్నట్లు నాయక్ చెప్పారు. సర్వేకి వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు పూర్తి సమాచారం అందించాలని కోరారు. అందించి సహకరించాలని కోరారు. ప్రతి ఇంటికి సంబంధించి పశువులు, గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ తదితర వివరాలను ఎన్యుమరేటర్ సేకరించాక, ఆ ఇంటి గోడపై స్టిక్కర్ మార్కింగ్ చేస్తారని కలెక్టర్ తెలిపారు. వీధిలో తిరిగే పశువులు, కుక్కల వివరాలూ సేకరిస్తారని చెప్పారు. అనంతరం ఎన్యుమరేషన్ కరదీపిక, స్టిక్కర్లు, ఐడీకార్డులు, పోస్టర్, కరపత్రాల కిట్‌ని ఆవిష్కరించారు. వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ రవికుమార్, పశుసంవర్ధక జిల్లా అధికారి రవికుమార్, ఏడీ డాక్టర్ శ్రీకాంత్‌కుమార్, వెటర్నరీఅసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ యోగానంద్, డాక్టర్ రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ శ్రీహరిత, డాక్టర్ శైలజ, రైతులు పాల్గొన్నారు.

తిరుపతిని గంజాయివనంలా మార్చారు

- జగన్‌పై ఓవీ రమణ విమర్శ

తిరుపతి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతిలో జగన్ రెడ్డి బంధువు, వైసీపీ నాయకుడు గంజాయికి వేసిన మూలాలు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తిలో గంజాయి వల్ల ఎందరో పిల్లలు బలైపోతున్నారు. తిరుపతిని గంజాయివనంలా జగన్ మార్చారు' అంటూ టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ ధ్వజమెత్తారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల కొండకు కూడా గంజాయి తీసుకెళ్లిన ఘనత వైసీపీదేనని ఆరోపించారు. జగన్ ఇంటి బాగోతాన్ని ఆయనే బయట పెట్టుకున్నారని, తల్లిని, చెల్లిని రోడ్డున పడేశారని విమర్శించారు.



శారదామఠం అక్రమ కట్టడాలపై తక్షణమే చర్యలు చేపట్టాలి: జనసేన



తిరుమల, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శారదా మఠంలో అక్రమ కట్టడాలపై టీటీడీ ఈవో, అదనపు ఈవో తక్షణమే చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నేత కిరణ్‌రాయల్ కోరారు. తిరుమలలోని శారదామఠం వద్ద శుక్రవారం ఆయన నేతలతో కలిసి శ్రీవారి చిత్రపటాన్ని ఉంచి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ అక్రమ కట్టడాలను తొలగించాలని గతంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్వామి అనుగ్రహంతో శారదాపీఠం వీటిని కూల్చివేయాలని జీవో వచ్చిందన్నారు. భక్తుల సేవ చేస్తామని తిరుమలలో మఠాలు తీసుకుని స్టార్‌హోటళ్ల తరహాలో భక్తుల నుంచి వసూలు చేస్తున్నారన్నారు. దొంగ రాజకీయనాయకులందరికీ స్వరూపనందేంద్ర బాస్ అని విమర్శించారు. ప్రభుత్వ ఆదేశాలను టీటీడీ అధికారులు పాటించి వెంటనే అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు.

ద్విచక్ర వాహనం బోల్తాపడి యువకుడి దుర్మరణం



కోట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు వద్ద శుక్రవారం అర్ధరాత్రి మోటార్ బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో గణేష్ (18) మృతి చెందాడు. మండలంలోని విద్యానగర్ చెందిన గణేష్ స్థానికంగా వాటర్ సర్వీస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. పని ముగించుకొని బైక్‌లో గూడూరుకు వెళుతుండగా చిట్టేడు వద్ద బైక్ అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ పవన్‌కుమార్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.



మృతి చెందిన వెంకటేశ్వర్లు

రోడ్డు ప్రమాదంలో పండ్ల వాపారి మృతి

వెంకటగిరి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ సుబ్బారావు కథనం మేరకు.. తోపుడు బండిపై పండ్ల వాపారం చేసుకొనే సాతికాలనీకి చెందిన మావిళ్ల వెంకటేశ్వర్లు క్రాస్ రోడ్డు వైపు వెళ్లేందుకు రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద ఆటో కోసం నిలుచొని ఉండగా ద్విచక్రవాహనం రాంగ్ రూట్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వెంకటేశ్వర్లును స్థానికులు ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడు మురళీని అదుపులోకి తీసుకొన్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని ప్రయాణికుడి మృతి

తడ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వరదయ్యపాలెం గ్రామానికి చెందిన ప్రభాకర్(45) శుక్రవారం సాయంత్రం సమయంలో సూళ్లూరుపేటకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు లోకల్ ట్రైన్‌లో తడకు వచ్చాడు. రైలు దిగి స్టేషన్ వెలుపలకు వెళ్లే క్రమంలో పట్టాలు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ ఢీకొంది ఈ ప్రమాదంలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెస్టారెంటు, ఫర్నిచర్ షోరూమ్, బంగారు దుకాణాలు, టెక్స్‌టైల్స్, బ్యూటీ సెలూన్స్.. ఇలా చిత్తూరులో ఏది కొత్తగా ప్రారంభించినా.. వెంటనే గుర్తొచ్చేది 'చిత్తూరు అబ్బాయి' ఇన్‌స్టాగ్రామ్ ఛానలే. దాని అడ్మిన్ విఘ్నేష్‌ను పిలిపించుకుని వీడియోస్ చేయించుకుంటున్నారు. సరదాగా ఛానెల్‌ను ప్రారంభించినా.. ఇప్పుడు చిత్తూరులో ఇతను ఓ చిన్న సెలబ్రిటీగా మారారు.

ట్రెండింగ్‌లో 'చిత్తూరు అబ్బాయి'

- సరదాగా ఇన్‌స్టాగ్రామ్ ఛానెల్ ప్రారంభం
- లక్షల వ్యూయర్స్‌తో దూసుకుపోతున్న విఘ్నేష్





'చిత్తూరు అబ్బాయి' ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ పేజీ

చిత్తూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పుచ్చకాయల విఘ్నేష్ కిరణ్ సొంతూరు పూతలపట్టు మండలంలోని దండుమిట్ట. చిత్తూరులోని విజయం బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చదువుతున్నాడు. బెంగళూరులోని ఓ కంపెనీలో అసోసియేట్ అనలిస్ట్‌గా పని చేసేవాడు. గతేడాది వినాయకచవితి నాడు చిత్తూరు అబ్బాయి పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో సరదాగా ఓ పేజీని ప్రారంభించారు. తొలుత స్ట్రీట్ ఫుడ్, కాలేజీ లైఫ్ స్టైల్ వంటి వీడియోలను పోస్టు చేసేవాడు. క్రమంగా ఫుడ్ రివ్యూస్ వీడియోలను అప్‌లోడ్ చేస్తూ వచ్చాడు. ఏడాదిలోనే 40 వేల మంది ఫాలోవర్స్‌ను, 5 లక్షల వ్యూయర్స్‌ను సంపాదించుకున్నాడు. చిత్తూరుతో పాటు కుప్పం, బెంగళూరు, పలమనేరు, వి.కోట, కల్లూరు, పీలేరు ప్రాంతాల్లోనూ వీడియోలు చేశారు. ప్రస్తుతం ఇళ్లు, స్థలాల అమ్మకాలకు సంబంధించిన రియల్ ఎస్టేట్ వీడియోలు చేస్తున్నారు. సోషల్ మీడియా పేజీలను ఏర్పాటుచేసి డెవలప్ చేసి ఇస్తున్నారు. డిజిటల్ మార్కెటింగ్, థియేటర్ యాడ్స్, బ్రాండింగ్ యాడ్స్ వంటివి కూడా చేస్తున్నారు.





కొత్త సినిమాలకు ఉచిత టికెట్లు

అభాగ్యులకు భోజన ప్యాకెట్లు

విద్యార్థులకు ఉచితంగా కూపన్లు

● 30 లక్షల వ్యూస్ దాటిన వీడియోలు..

విఘ్నేష్ ఇప్పుడు ఏ వీడియో పోస్టు చేసినా రెండు రోజుల్లోనే ఓ లక్ష నుంచిపది లక్షల మంది చూస్తున్నారు. బెంగళూరులో పీజీ లైఫ్ కష్టాలు, చిత్తూరులోని ఎలైట్ మద్యం షోరూమ్, చిత్తూరు కేఫ్ రెస్టారెంటు గురించి చేసిన వీడియోల్ని 30 లక్షల మందికి పైగా చూశారని విఘ్నేష్ తెలిపారు.



ఓ రెస్టారెంట్‌లో ఫుడ్ రివ్యూ ఇస్తూ..

● ఆదాయంలో సగం సేవా కార్యక్రమాలకు..

ఇన్‌స్టాగ్రామ్ ప్రమోషన్స్ ద్వారా వచ్చిన ఆదాయంలో సగం సేవా కార్యక్రమాలకు విఘ్నేష్ ఖర్చు చేస్తున్నాడు. రోజూ రాత్రివేళ రోడ్డు పక్కన సేదదీరే అభాగ్యులకు భోజనం అందిస్తున్నాడు. విద్యార్థులకు ఆయా రెస్టారెంట్లలో ఫుడ్‌లో డిస్కౌంట్ పొందేలా, యువకులు బైక్స్‌ను వాష్ ఫ్రీగా వాటర్ సర్వీసింగ్ చేసుకునేలా కూపన్స్ అందిస్తున్నాడు. దీంతో పాటు కొత్త సినిమా విడుదల సమయంలో ఐదుగుర్ని ర్యాండమ్‌గా ఎంపిక చేసి టికెట్లను ఉచితంగా అందిస్తారు. దీంతో విఘ్నేష్ ఎక్కడైనా కనిపించినా విద్యార్థులు, యువకులు సెల్ఫీలు తీసుకుంటున్నారు.

వరసిద్ధుడి సేవలో ఎన్టీఆర్ తనయుడు



రామకృష్ణకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈఓ రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 25: ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ శుక్రవారం సాయంత్రం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ జగన్మోహన్



చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో ఆరు కొత్త బస్సులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైవర్‌గా మారారు. కొత్త బస్సులో ఉమ్మడి పార్టీల నేతలు, కార్యకర్తలు, ఆర్టీసీ సిబ్బందిని ఎక్కించుకుని బస్టాండు నుంచి గాంధీ విగ్రహం సర్కిల్ వరకు వెళ్లి తిరిగి బస్టాండుకు వచ్చారు.

- చిత్తూరు సిటీ, ఆంధ్రజ్యోతి

కాణిపాకంలో ఖోఖో సందడి



తలపడుతున్న అనంతపురం-చిత్తూరు బాలికలు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో 43వ రాష్ట్ర బాలబాలిక చాంపియన్‌షిప్ ఖోఖో పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి ఈ పోటీలను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఖోఖో, కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలను చిత్తూరు అసోసియేషన్ అధ్యక్షుడు నల్లపోతులప్రవీణ్.. కాణిపాకంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు.

తొలిరోజున ఇలా..

బాలికల విభాగంలో.. చిత్తూరు, అనంతపురం జట్ల మధ్య జరిగిన పోటీలో.. చిత్తూరు 8-3 తేడాతో విజయం సాధించింది. కడపపై పశ్చిమ గోదావరి, గుంటూరుపై విశాఖపట్టణం, విజయనగరంపై శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. బాలుర విభాగంలో.. నెల్లూరు, కడప జట్ల మధ్య జరిగిన పోటీలో 11-11 స్కోర్‌తో మ్యాచ్ డ్రాగా ముగిసింది. పోటీలు శనివారం, ఆదివారం కూడా జరగనున్నాయి. టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం : ఒకరి అరెస్టు



పట్టుబడ్డ స్మగ్లర్, ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా బద్వేలు టాస్క్‌ఫోర్స్ పోలీసులు 14 ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం గురువారం బద్వేలు సమీపంలోని బ్రాహ్మణపల్లి వద్ద కూంబింగ్ చేపట్టారు. అక్కడ కొందరు అనుమానాస్పదంగా కనిపించారు. దగ్గరకు వెళ్లగా పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో నెల్లూరు జిల్లాకు చెందిన వ్యక్తిని పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో తనిఖీ చేయగా 14 ఎర్రచందనం దుంగలు లభించాయి. వారు వదిలి వెళ్లిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

న్యూఢిల్లీ కార్యశాలకు టీచర్ కూనాటి సురేష్



శ్రీకాళహస్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌కు మరో మంచి అవకాశం లభించింది. జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ ఈ నెల 28, 29 తేదీలలో న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న రెండు రోజుల కార్యశాలకు అమరావతిలోని ప్రభుత్వ సంచాలకుల ద్వారా ప్రత్యేక ఆహ్వానం అందింది. రాష్ట్రం నుంచి విషయ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయుడిగా సురేష్‌ను నామినేట్ చేశారు. సాంఘిక శాస్త్రం నుంచి హాజరవుతున్న ఏకైక వ్యక్తిగా సురేష్ వుండడంపై పలువురు ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

వి.కోటలో ఆటో దొంగల పట్టివేత

రూ. 10 లక్షల విలువైన 6 ఆటోల సీజ్

నలుగురు నిందితుల అరెస్టు, మరో నిందితుడు పరారీ



ఆటోల దొంగలను అరెస్టు చూపుతున్న పోలీసులు

వి.కోట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వి.కోట పరిసరాల్లో ఆటోలు దొంగలించి తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరువాసికి విక్రయిస్తున్న ముఠాను వి.కోట పోలీసులు పట్టుకున్నారు. కొంత కాలంగా వి.కోటలో ఆటోలు మాయం అవుతుండటంతో నిఘా ఉంచిన పోలీసులు చాకచక్యంగా నలుగురు నిందితులను పట్టుకుని, ఆరు ఆటోలను సీజ్ చేశారు. సీఐ సోమశేఖర్ కథనం మేరకు.. ఎస్పీ మణికంఠ చందోలు, డీఎస్పీ ప్రభాకర్‌ల ఆదేశాల మేరకు ప్రత్యేక టీంతో ఆటోల దొంగతనాలపై నిఘా ఉంచారు. గురువారం ఉదయం విశ్వసనీయ సమాచారం మేరకు వి.కోట నుంచి కనమనాయనపల్లెకు వెళ్లే దారిలో హంద్రీ-నీవా కాల్వ పక్కన కొందరు యువకులు ఆటోలతో ఉన్నట్లు సమాచారం అందింది. అక్కడకు చేరుకున్న పోలీసులను చూసి యువకులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ముగ్గురిని అదుపులోకి తీసుకోగా రెండు ఆటోలను దొంగలించి తమిళనాడులో విక్రయించేందుకు వెళుతున్నట్లు అంగీకరించారు. వి.కోట పట్టణం మసీదు వీధికి చెందిన జబీ(31), బాపూజీ వీధికి చెందిన మున్నవీర్ అలియాస్ సోను(19), హనుమేపల్లెకు చెందిన ఎస్.సల్మాన్ అలియాస్ సల్లూ (22) ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా చోరీ విషయం బయటపడింది. ఈ ముగ్గురు వేణుగోపాలస్వామి వీధికి చెందిన రహమాన్ అలియాస్ సుభాన్‌తో కలసి జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో వి.కోట, శివుని కుప్పం, కర్ణాటక రాష్ట్రం ఎన్.జీ. ఉల్కూరు ప్రాంతాల్లో ఆరు ఆటోలను దొంగలించి తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరుకు చెందిన మోకానిక్ అరుణ్‌కుమార్‌కు విక్రయించేవారమని తెలిపారు. నిందితుల వద్ద రెండు, అరుణ్‌కుమార్ వద్ద 4 ఆటోలను పోలీసులు రికవరీ చేశారు. పట్టణంలో గతంలో దొంగతనానికి గురైన వాహన యజమానులను రప్పించి ఆటోలను గుర్తించారు. ఈ మేరకు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించగా న్యాయమూర్తి వారికి 14 రోజుల జూడీషియల్ కస్టడీ విధించారు. ఈ మేరకు నిందితులను మదనపల్లె జైలుకు అప్పగించారు. ఆటోల దొంగలను పట్టుకునేందుకు చొరవ చూపిన వి.కోట సీఐ, ఎస్సై, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

వచ్చిన అర్జీలే వస్తున్నాయి !

పరిష్కారానికి చొరవ చూపండి ● కుప్పం గ్రీవెన్స్ డేలో అధికారులపై కలెక్టర్ అసహనం



కుప్పంలో ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం డివిజన్‌లో ప్రజలనుంచి వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ వస్తున్నాయని, పరిష్కారానికి చొరవ చూపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. కుప్పంలోని మండల సచివాలయంలో శుక్రవారం కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడా పీడీ వికాస్ మర్మత్ కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మధ్యాహ్నం 1 గంటదాకా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగిన తర్వాత కలెక్టర్ సుమిత్ కుమార్, వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేదికలో అందిన ప్రతి అర్జీని ఆడిట్ చేస్తామన్నారు. ఆయా ప్రజా సమస్యలకు గడువు విధించుకుని నిర్దేశిత కాలంలోపు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. గత గ్రీవెన్స్ డేలో అందిన అర్జీలు కూడా ఇంకా పరిష్కారం కాకపోవడంవల్లే అదే సమస్యలపై పదేపదే అర్జీలు అందుతున్నాయని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారంలో భాగంగా విచారణ, సర్వే క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని ఆదేశించారు. అవసరం అయితే ఉన్నధికారికి బదలాయించాలన్నారు. నేరుగా కొంతమంది అర్జీదారులకు ఫోన్లు చేసి పరిష్కారం గురించి స్పందన తెలుసుకుంటానన్నారు. కాబట్టి అధికారులు చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయాలకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలను పరామర్శించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఒకవేళ సమస్య పరిష్కరించలేకపోతే అందుకు గల కారణాన్ని కూడా అర్జీదారులకు వివరించాల న్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించగలిగే అంశాలను జిల్లా సచివాలయానికి పంపితే పరిశీలిస్తామన్నారు. రీ సర్వే, ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్, మ్యుటేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించా రు. ఆర్టీసీ వైస్‌చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, జడ్పీ సీఈవో రవికుమార్, హౌసింగ్ పీడీ పద్మనాభం, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీవో బాధ్యతల స్వీకారం



పలమనేరు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఆర్డీవోగా శుక్రవారం భవాని బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న మనోజ్‌రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో చిత్తూరులో ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారిగా (కలెక్టరేట్‌లో) పనిచేస్తున్న భవాని ఇక్కడికి బదిలీ అయ్యారు.

ముక్కంటి సేవలో రష్యన్లు



శ్రీకాళహస్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయాన్ని పలువురు విదేశీయులు శుక్రవారం దర్శించుకున్నారు. రష్యాకు చెందిన ఏడుగురు, కజికిస్తాన్‌కు ముగ్గురు, టర్కీకి చెందిన ఐదుగురు మొత్తం 15మంది శుక్రవారం ముక్కంటి ఆలయంలో రూ.500రాహుకేతు సర్పదోష నివారణ పూజలను చేయించుకున్నారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరి దుర్మరణం



కార్తీక్ (ఫైల్ ఫొటో)

గుడిపాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వసంతాపురం పంచాయతీ పశుమంద ఎస్టీకాలనీలో శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పశుమంద ఎస్టీకాలనీకి చెందిన కార్తీక్(35).. చెంగమ్మనాయుడు అనే రైతు పొలంలో దున్నతుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రామ్మోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నాడు.

బెస్తపల్లెలో వివాహిత అదృశ్యం



శిరీష

ఐరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బెస్తపల్లెలో ఓ వివాహిత అదృశ్యమయ్యారని ఎస్ఐ నరసింహులు శుక్రవారం తెలిపారు. బెస్తపల్లెకు చెందిన దేవేంద్ర భార్య శిరీష ఈనెల 21వ తేదీ నుంచి కనిపించకుండా పోయారు. ఆ రోజు నుంచి బంధువులు, తెలిసిన వారిళ్లలో ఆమె భర్త వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శిరీష తండ్రి పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం ఎస్ఐ తెలిపారు. ఈమె ఆచూకీ తెలిస్తే 94407 96722 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.



సారా తయారీ కేసులో రిమాండు



నిందితుడితో పోలీసులు

నగరి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్రవాడకు చెందిన చెరువు వద్ద సారా తయారు చేస్తున్న కరివర్దన్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. అలాగే 200లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. నిందితుడిని ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ గోపాలకృష్ణ ముందు హాజరు పరచగా.. 15 రోజులపాటు రిమాండ్ విధించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి


పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

పుంగనూరు, అక్టోబరు25(ఆంధ్ర జోతి) : డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మదనపల్లె సీనియర్ సివిల్ జడ్జి శిరీష్ పేర్కొన్నారు. శుక్రవారం పుంగనూరు కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీకి అనువైన క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవాలని తెలిపారు. పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పుంగనూరు రూరల్, అక్టోబరు25(ఆంధ్ర జ్యోతి): సుగాలిమిట్ట అటవీప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు శుక్రవారం సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి చేయగా 6మంది పట్టుబడగా ఇద్దరు పరారీ అయినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ. 2.42లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెట్లే సకల జీవులకు ప్రాణాధారం


డివైడర్లలో మొక్కలు నాటుతున్న కంచర్ల తదితరులు

కుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆకుపచ్చని చెట్లే మానవులతోసహా సృష్టిలోని సకల జీవులకు ప్రాణాధారమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, కడా పీడీ వికాస్‌మర్మత్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. కుప్పంలోని నేతాజీరోడ్డు, బైపాస్ లింక్ రోడ్లలో వారు బుధవారం మొక్కలు నాటారు. డివైడర్ల సుందరీకరణ పనుల్లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం మనం తీసివేస్తున్న చెట్ల స్థానంలో ప్రత్యామ్నాయంగా ఎక్కడో ఒక చోట మొక్కలు నాటి పెంచాలన్నారు. కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రీన్ కుప్పం-క్లీన్ కుప్పం ప్రాజెక్ట్‌లో భాగంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లు, డివైడర్లు, రోడ్ల విస్తరణ పనులలో భాగంగా మొక్కలను పెంచుతున్నామన్నారు. దీనికోసం కలకత్తానుంచి వివిధరకాల మొక్కలను తెప్పించామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, 20, 22 వార్డు కౌన్సిలర్లు ఎస్.సోమశేఖర్, బి.సురేశ్ కుమార్, జనసేన నియోజకవర్గ కో ఆర్డినేటర్ నరేశ్, మాజీ ఎంపీపీ వెంకటేశ్, అధికారులు పాల్గొన్నారు.

నూతన బోరును పరిశీలించిన జడ్పీ సీఈవో



శాంతిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తుమ్మిశి ఆదర్శ పాఠశాలలో నూతనంగా వేసిన బోరును శుక్రవారం జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు పరిశీలించారు. గతంలో పాఠశాలలో తీవ్ర నీటి సమస్య ఉందని పలువురు ప్రజా ప్రతినిధులు కలెక్టర్ సుమిత్ కుమార్, కడా పీడీ వికాస్ మర్మత్‌లకు వినతి చేశారు. దీనిపైన స్పందించిన వారు నూతన బోరు వేసేందుకు నిధులు మంజూరు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఎంపీడీవో కుమార్ నూతన బోరు వేయించారు. శుక్రవారం జడ్పీ సీఈవో కుప్పం పర్యటన ముగించుకుని వెళుతూ శాంతిపురం ఆదర్శ పాఠశాలలో తాగునీటి బోరును పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో రవికుమార్, శాంతిపురం ఈవోపీఆర్డీ రవినాయక్, శాంతిపురం ఎంపీడీవో కుమార్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు25(ఆంధ్ర జ్యోతి): ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేలా హౌసింగ్, ఉపాధి సిబ్బంది పని చేయాలని ఎంపీడీవో లీలామాధవి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సచివాలయ హౌసింగ్ అధికారులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమయ్యారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 3వేల ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో 2352 ఇళ్లనిర్మాణాలు పూర్తి చేయగా 335 ఇళ్లు మోల్డింగ్, 313 ఇళ్లు గోడ నిర్మాణాలు జరిగినట్లు హౌసింగ్ ఏఈ శేఖర్ తెలిపారు. దీంతో ఎంపీడీవో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి స్థాయిలో నవంబరు ఆఖరికి పూర్తి చేయాల్సివుందన్నారు. అలా నిర్మాణాలు జరగని ఇళ్లకు బిల్లులు నిలుపుదల చేస్తామన్నారు. సమావేశంలో ఏపీవో శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపేటలో వైద్య శిబిరం



రామకుప్పం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం రాజుపేటలో శుక్రవారం ఎన్టీయార్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, చికిత్సలందించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసి, తగు వైద్యసలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు తిలక్, పార్థసారథి, ఝాన్సీరాణి, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి నరసింహులు, పంచాయతీ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నారాయణస్వామి, వెంకటస్వామి, మాజీ సర్పంచు మురుగేష్ పాల్గొన్నారు.

కేబుల్ వైరు చోరీ

వి.కోట, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం కృష్ణాపురం వద్ద తాగునీటి బోరు, స్టార్టర్ నుంచి దొంగలు కేబుల్ వైరును చోరీ చేశారు. దీంతో మద్దిరాళ్ళ గ్రామానికి తాగునీరు అందించలేక పంచాయతీ వారు ఇబ్బంది పడుతున్నారు. గురువారం రాత్రి దుండగులు రోడ్డు పక్కనే ఉన్న బోరు వద్ద నుంచి సమీపంలోని స్టార్టర్ వరకు ఉన్న కేబుల్‌ను, అలాగే మద్దిరాళ్ళ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని బోరు కేబుల్‌ను కత్తిరించుకెళ్ళారు. చోరీ విషయమై సర్పంచ్ రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పోలీసు లాంఛనాలతో కానిస్టేబుల్‌కు అంత్యక్రియలు



పుంగనూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన కానిస్టేబుల్‌కు పోలీసు లాంఛనాలతో శుక్రవారం పుంగనూరు మండలంలో అంత్యక్రియలు నిర్వహించారు. సుగాలిమిట్ట పంచాయతీ చిన్నతాండాకు చెందిన మునియా నాయక్ కుమారుడు విజయ్‌కుమార్‌నాయక్(47) తిరుపతిలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన చిన్నతాండాకు తరలించి పోలీసు లాంఛనతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం వద్దు

సోమల, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రయాణం సాగించాలని ఎస్ఐ శివశంకర పేర్కొన్నారు. శుక్రవారం కలికిరి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. రికార్డుల్లేని వాహనాదారులకు అపరాధ రుసుం వసూలు చేశారు.

ఏనుగుల గుంపును కట్టడి చేయండి

డీఎఫ్‌వో భరణితో చల్లా బాబురెడ్డి


ధ్వంసమైన పంటలను పరిశీలిస్తున్న చల్లా బాబురెడ్డి

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పంటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును కట్టడి చేయాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబురెడ్డి డీఎఫ్‌వో భరణిని కోరారు. పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లి పంచాయతీలో ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన పంటలను శుక్రవారం చల్లా బాబురెడ్డి పరిశీలించారు. డీఎఫ్‌వో భరణితో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటలపై ఏనుగులు దాడులు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మూడు నెలలుగా మండలంలో పంటలపై ఏనుగుల దాడులు అధికమయ్యాయన్నారు. ఏనుగులను నివారించడంలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్‌బాబు, ఏపీఓ షౌకత్, జడ్పీటీసీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

విస్మృత స్వాతంత్ర్య యోధుడు ముత్తురామలింగ దేవర్


కుప్పంలో దేవర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించే క్రమంలో ఎందరో యోధులు ఎన్నో త్యాగాలు చేసి వెలుగులోకి రాకుండా మరుగులోనే ఉండిపోయారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నంలు అన్నారు. అటువంటి విస్మృత స్వాతంత్ర్య సమరయోధుల్లో ముత్తురామలింగ దేవర్ ఒకరని పేర్కొన్నారు. కుప్పంలో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు, ఆధ్యాత్మిక నాయకుడు, ముకులాథోర్ సమాజం దేవతగా కొలిచే ముత్తురామలింగ్ దేవర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముకులథోర్ సామాజిక వర్గం ఇప్పటికీ దేవర్‌ను కొలుస్తారన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ తన తల్లికి దేవర్‌ను తమ్ముడిగా పరిచయం చేశారని గుర్తు చేశారు. దేవర్ 1952నుంచి ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ డిప్యూటీ ఛైర్మన్‌గా పనిచేశారన్నారు. అంతేకాక జాతీయ పార్లమెంటరీ నియోజకవర్గానికి మూడుసార్లు ఎంపికయ్యారని చెప్పారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్న దేవర్, తనకు తండ్రి వారసత్వంగా వచ్చిన 600 ఎకరాల పంట భూములను పేద బడుగు బలహీన వర్గాలకు ధారాదత్తం చేసిన గొప్ప దానశీలి అని కొనియాడారు. దేవర్ అడుగు జాడల్లో నేటి యువత నడవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పిరమాలై కల్లర్ మరవర్ అగముడియార్, పిరమాలై కల్లర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే అంటువ్యాధుల నివారణ

జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు


శాంతిపురం శివాలయం వీధిలో పరిసరాలను పరిశీలిస్తున్న డాక్టర్ హనుమంతరావు

శాంతిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొంటేనే అంటువ్యాధులను నివారించవచ్చునని జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు అన్నారు. శుక్రవారం శాంతిపురం వైద్యాధికారులు వంశీకృష్ణ, ప్రసాద్‌తో కలిసి శాంతిపురం శివాలయం వీధిలో ఇళ్ల పరిసరాలను, నీటి ట్యాంకులను పరిశీలించారు. కొంతమంది చాలారోజుల నుంచి నీటి నిల్వ చేయడంతో లార్వాలు వృద్ధి చెందుతున్నట్లు గుర్తించారు. ఆ నీటిని అప్పుటికప్పుడు శుభ్రం చేయించారు. ఆరోగ్య సిబ్బంది వారానికొకసారి ప్రతి వీధిలో పర్యటించి పరిసరాలు ఎలా ఉన్నాయో తెలుసుకొని అంటువ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. తరువాత శాంతి పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కన నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ యూనిట్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మలేరియా అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్స్ వంశీకృష్ణ, ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే మామిడిలో అధిక దిగుబడి


మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు రూరల్,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మామిడి పంటలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధ్యమని ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో 8 మండలాల సచివాలయాల వ్యవసాయ, హార్టికల్చర్ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మామిడి సాగు అధికంగా ఉన్నా రైతులకు లాభసాటిగా మార్చలేకపోతున్నామని, దానికి కారణం వ్యాపారులకు పంటను అమ్మడం, తోటలను రైతులు సక్రమంగా పట్టించుకోకపోవడంతో దిగుబడి తగ్గుతున్నట్లు వివరించారు. సిబ్బంది రైతులకు మామిడి తోటల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. మొక్కలకు వేసవిలో నీరు అందివ్వడం, సేంద్రియ ఎరువులు వేయడం, పంట పూర్తి అయిన నెలలోపు ఎండిన కొమ్మలు, గుబురు కత్తిరించడం వల్ల దిగుబడి పెరుగుతుందన్నారు. సకాలంలో మందులు పిచికారీ చేయల్సివుందన్నారు. సమావేశంలో శాస్త్రవేత్త బాలహుసేన్, వ్యవసాయశాఖ అధికారి విజయ్‌శంకర్‌రెడ్డి, ఏడీఏ శివకుమార్‌రాజు, పుంగనూరు ఉద్యానశాఖ అధికారి వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా బందార్లపల్లె క్రాస్ రహదారి



రామకుప్పం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని బందార్లపల్లె క్రాస్ సర్కిల్ నుంచి దిగువ రైస్‌మిల్లు రహదారి అధ్వానంగా మారింది. 2017లో నిర్మించిన తారురోడ్డు నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో పలుచోట్ల గుంతలమయంగా మారింది. ఇటీవల జడివానతో గుంతలు పెద్దవై, వర్షపునీరు రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. 20కి పైగా గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండానే నిత్యం రామకుప్పానికి రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎన్టీఆర్ కాలనీలో పారిశుధ్య పనులు

శాంతిపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు రాళ్ళబూదుగూరు సమీపంలోని ఎన్టీఆర్ కాలనీకి మోక్షం లభించింది. శుక్రవారం సర్పంచ్ లక్ష్మి, టీడీపీ నేతలు బసవరాజు, మురళి, వాజీద్, రామప్ప, కుమార్, ఇతర టీడీపీ నేతలు కలిసి కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టారు. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రాళ్ళబూదుగూరులోని నిరుపేదలకు గ్రామ సమీపంలోనే ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గృహాలను మంజూరు చేసింది. కాలనీలో సుమారు 50మంది గృహాలు నిర్మించుకున్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాలనీ వాసులు కష్టాలు తీరినట్లేనని ఆనందం వ్యక్తం చేస్తువచ్చారు.

అర్హులందరికీ జాబ్ కార్డులు అందజేయాలి

సదుం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఉపాధి జాబ్ కార్డులు అందజేయాలని జిల్లా దళిత సంఘం నాయకుడు పాలకుంట శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మంద సీతాపతి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీల సమావేశం జరిగింది. ఎస్సీ, ఎస్టీలకు మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని మంజూరు చేసి పట్టాలు పంపిణీ చేయాలని, అలాగే 200 రోజులు ఉపాధి పని దినాలు కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటస్వామి, దళిత సంఘ నాయకులు సీతాపతి, రాంబాబు, మదనమోహన్, వెంకటరమణ, కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీవో



పలమనేరు : ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శుక్రవారం పలమనేరు ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన భవాని మర్యాదపూర్వకంగా కలిశారు. హౌసింగ్ డీఈగా బాధ్యతలు స్వీకరించిన స్వామిదాసు ఎమ్మెల్యేను కలిశారు.

కుక్కర్లు, వాటర్ క్యాన్ల వితరణ



పలమనేరు : పలమనేరుకు చెందిన శ్రీపురం సీతారామయ్య నాగమణి ట్రస్టు, రత్నాబయోటెక్ వారు శుక్రవారం కొలమాసనపల్లి సెక్టార్ పరిధిలోని 25 అంగన్‌వాడీ కేంద్రాలకు కుక్కర్లు, వాటర్ క్యాన్లు, మ్యాట్లు అందజేశారు. కార్యక్రమంలో శ్రీపురం సీతారామయ్య, సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

'అభివృద్ధిని మేము అడ్డుకోలేదు'

పలమనేరు : పలమనేరు మండల అభివృద్ధిని తామెవ్వరూ అడ్డుకోలేదని, అధికారులపై ఒత్తిడి తెచ్చి అభివృద్ధిని అడ్డుకొన్నది ఎవరో ప్రజలందరికి తెలుసని ఎంపీపీ రోజా, వైస్ ఎంపీపీ జయశ్రీ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం పెట్టి రాజకీయాలు మాట్లాడటం టీడీపీ నాయకులకు తగదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రమేష్, మౌనిక, సర్పంచ్‌లు తిరుమలేష్, మునస్వామి, విశ్వనాథరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, బుజ్జమ్మ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల పనుల పరిశీలన

రామకుప్పం : బందార్లపల్లె పంచాయతీ అడవి పామనబోయనపల్లెలో మినీ గోకులం షెడ్ నిర్మాణపు పనులను శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా కుప్పం నియోజకవర్గానికి ఎక్కువ షెడ్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు పెరుమాళ్, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, నేతలు నరసింహ, మురళి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పుంగనూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు మండల సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్ చార్జి ఎంపీడీవో లీలామాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

వి.కోటలో రక్తదాన శిబిరం

వి.కోట : విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివని సీఐ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వి.కోట అర్బన్ స్టేషన్‌లో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం చిత్తూరు జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వి.కోట సీహెచ్‌సీలో పలువురు పోలీసులు, విద్యార్థులు రక్తదానం చేశారు. వైద్యాధికారి మురళి, డా. ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ బాబు, ఏఎస్ఐ జయకృష్ణ, సిబ్బంది విద్యానికేతన్, నలంద, వాణి విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ పోటీలకు సదుం విద్యార్థులు

సదం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సదుం ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న ధరణీధర్, జాహ్నవి, గుణశేఖర్‌లు అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జైకుమార్ రెడ్డి తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పలమనేరు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెయిరీ, అనిమల్ హస్బెండరీ సబ్జెక్టుల బోధించడానికి గెస్టు లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు కోరారు. ఎంఎస్సీ డెయిరీ, లేదా ఎంఎస్సీ జువాలజీ చేసిన వారు ఈ పోస్టులకు అర్హులన్నారు. యూజీసీ నెట్ లేదా పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత వుంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30లోపు దరఖాస్తులను ప్రిన్సిపాల్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేడు టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

కుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ 4వ వార్డు పరిధిలోని కతమూరులో శనివారం తెలుగుదేశం పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం ప్రారంభిస్తారని పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే తెలుగుదేశం శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పశుగణన సర్వే ప్రారంభం

సోమల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెద్దఉప్పరపల్లె పశువైద్యశాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం పశుగణన సర్వేను మాజీ వైస్‌ఎంపీపీ ఉమాపతి నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమల ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు మేకలు తదితర వాటి సంఖ్యను నమోదు చేస్తారన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు. పి. శ్రీనివాసులు, చంద్రశేఖర్‌నాయుడు, బాల, బాలకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశుగణన పోస్టర్ అవిష్కరణ

చౌడేపల్లె, అక్టోబర్25:(ఆంధ్రజ్యోతి): జాతీయ పశుగణన పోస్టర్‌ను టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అవిష్కరించారు. శుక్రవారం పశువైద్యాధికారి పవన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాలకు వచ్చే ఎన్యుమరేటర్లకు రైతులు జీవాల వివరాలు తెలియజేయాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు, తదితర మందులు పశువుల సంఖ్య ఆధారంగానే సరఫరా అవుతాయని, ప్రతి రైతు ఖచ్చితంగా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆలాగే ఇటీవల జరిగిన కబడ్డీ పోటీలలో జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



చౌడేపల్లె, అక్టోబర్ 25:(ఆంధ్రజ్యోతి) ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు



చౌడేపల్లె, అక్టోబర్25: (ఆంధ్ర జ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


భవనం పైనుంచి జారిపడి కార్మికుడి మృతి

రొంపిచెర్ల, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) :రొంపిచెర్ల ఉన్నత పాఠశాలలో భవన నిర్మాణ పనులకు వచ్చిన ఓ కూలీ ప్రమాదవశాత్తు జారిపడి మృత్యువాత పడ్డాడు. బండకిందపల్లెకు చెందిన ఎస్.అబ్దుల్‌నబీ కుమారుడు అహమ్మద్ బాషా(19) స్కూల్ భవన నిర్మాణ పనులకు శుక్రవారం కూలీగా వచ్చాడు. పని చేస్తూ జారి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో తిరుపతి ఆస్పత్రి తీసుకెళ్లగా మృతి చెందాడు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రొంపిచెర్ల,అక్టోబరు25: 9ఆంధ్రజ్యోతి) : మండలంలోని బండకిందపల్లెకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎస్.అహమ్మద్‌బాషా(19) ప్రమాదవశాత్తు మృతి చెందడంతో కలెక్టరు ఆదేశానుసారం మృతుడి కుటుంబసభ్యులకు సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకట్రమణారెడ్డి పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి ప్రభుత్వం ఆర్థిక సాయం చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు ఉయ్యాలరమణ పాల్గొన్నారు.

విరూపాక్షి మారెమ్మకు పూజలు



పుంగనూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి మామిడి, వేప ఆకులతో తోరణాలు కట్టి పూజలు, అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళా భక్తులు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికలు మొక్కులుగా చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

గైర్హాజరుపై టీచర్‌కు నోటీసు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విధులకు అనధికారికంగా గైర్హాజరైన బైరెడ్డిపల్లె మండలం ఎంపీపీ పాఠశాల లక్కనపల్లి ఎస్జీటీ టీచర్‌గా పనిచేస్తున్న ఎన్.అరుణకుమారికి డీఈవో దేవరాజు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. 2023 జూన్ 31 నుంచి పాఠశాలకు అనధికారికంగా గైర్హాజరైన ఆమెను వివరణ కోరుతూ.. ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఇచ్చారు. పేర్కొన్న చిరునామాలో లేనందున ఏపీ సివిల్ సర్వీసెస్ ప్రవర్తన నియమావళి కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో డీఈవోను నేరుగా కలిసి వివరణ ఇవ్వాలన్నారు.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు


పాత కలెక్టరేట్ జంక్షన్‌లో ప్రస్తుతం ఇలా..

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రోడ్లపై ఆక్రమణలను అధికారులు తొలగించారు. 'ఈ ట్రాఫిక్ పరిష్కారమెప్పుడు?' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఎస్పీ మణికంఠ ఆదేశాలతో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్న ప్రాంతాల్లో పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రోడ్లపై నిలిపిన వాహనదారులకు జరిమానాలు విధించారు. నగరపాలక అధికారులైతే.. గిరింపేట, చర్చివీధి, పాతబస్టాండు, ఓటీకే రోడ్డు, కొంగారెడ్డిపల్లె తదితర ప్రాంతాల్లో వీధుల్లో వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారులను సమీపంలోని రైతు బజార్లు, మార్కెట్లకు తరలించారు.

ఆరు కొత్త ఆర్టీసీ బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే


ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండులో ఆరు కొత్త బస్సులకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పూజలు నిర్వహించి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఐదు నెలల్లోనే చిత్తూరులో 33 బస్సులను ప్రారంభించడం జరిగిందన్నారు. అడిగిన వెంటనే బస్సులు కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. అనంతరం ఆధునీకరించిన కార్గో సర్వీస్ కేంద్రంలో పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, మాజీ మేయర్ కటారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, నేతలు సురేంద్రకుమార్, వసంత్ కుమార్, సీఎం విజయ, రాము,రాజశేఖర్, ఆనంద్, ఫైరోజ్, ఆర్టీసీ 1, 2 డిపోల మేనేజర్లు కృష్ణమూర్తి, రూపశ్రీ, నేతలు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం టౌన్ సర్వీసు

విద్యార్థుల కోసం ప్రత్యేక టౌన్ సర్వీస్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. నగర శివారులోని కొత్త కలెక్టరేట్, ప్రశాంత్ నగర్, అనుప్పల్లి ప్రాంతాల నుంచి గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలకు రావడానికి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ మార్గంలో సర్వీసును ఆయన ఏర్పాటు చేయించారు. అలాగే మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో చదివే సుమారు 70మంది విద్యార్థులకు జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ తరఫున ఉచితంగా ఆర్టీసీ బస్‌పాసులు అందజేశారు. హెచ్‌ఎం రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


పశుగణనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, జేడీ

బంగారుపాళ్యం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. పశుగణన కార్యక్రమాన్ని నలగాంపల్లెలో టీడీపీ మండల అధ్యక్షుడు ఫాంహౌస్‌లో ఎమ్మెల్యేతో కలిసి పశుసంవర్థకశాఖ జేడీ ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. నాయకులు ఎన్‌పీ జయప్రకాష్, జయచంద్రనాయుడు, ధరణి ప్రసాద్‌నాయుడు, స్వామిదాస్, జనార్ధనగౌడ్, నాగరాజగౌడ్, గిరిబాబు, డాక్టర్లు ఎస్.ఆషీఫ్, ఝాన్సీ, ఆరిఫ్ పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: కలిజవేడు పంచాయతీ కె.నాశంపల్లె గ్రామంలో సర్పంచ్ నీలావతితో కలిసి వెటర్నరీ ఏడీ డాక్టర్ మురళీమోహన్ శుక్రవారం పశుగణనను ప్రారంభించారు. ఎట్టేరి వెటర్నరీ డాక్టర్ నాగాంజనేయులు, సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

మా స్థలాన్ని ఆక్రమించారు

● టీడీపీ నేతలకు ఎస్టీల ఫిర్యాదు


ఎస్టీకాలనీ వాసులతో మాట్లాడుతున్న బాలాజీ నాయుడు, నాగరాజు యాదవ్

గుడిపాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుపు ఎస్టీ కాలనీలోని ఎస్టీ సంఘ నేత రాము, గ్రామానికి చెందిన వెంకటేశ్‌లు సీసీ రోడ్డును ఆక్రమించుకుని గోడ నిర్మాణం చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఈ మేరకు మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్‌ను శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో నాయకులు ఈ విషయాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. విచారించి న్యాయం చేస్తామని ఎస్టీలకు తహసీల్దార్ హామీ ఇచ్చారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు

బంగారుపాళ్యం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో మండల రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సంఘాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మురళీమోహన్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా నేతాజి నాయుడు, ఉపాధ్యక్షులుగా రాజేంద్రనాయుడు, జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శులుగా లోకనాథం నాయుడు, ప్రభాకర్, కోశాధికారిగా నీరజాక్షులగౌడ్, అన్బూ ఎన్నికయ్యారు. టీడీపీ మండల అధ్యక్షుడు జయప్రకాష్, జయచంద్రనాయుడు, క్లస్టర్ ఇన్ చార్జ్ ధరణి, జిల్లా ప్రధానకార్యదర్శి కోదండయాదవ్, నేతలు కోకా ప్రకాష్‌నాయుడు, హేమచంద్రనాయుడు, రాధాక్రిష్ణం నాయుడు, రమేష్, గిరిబాబు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై అప్రమత్తంగా ఉండండి

● ప్లానింగ్ సెక్రటరీలకు ఏసీపీ ఆదేశం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో అక్రమ నిర్మాణాలపై అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ నాగేంద్ర ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశాన్ని నిర్వహించారు. రోజు రోజుకూ నగరంలో నిర్మాణాలు అధికమవుతున్నాయని చెప్పారు. ఇదే సమయంలో అక్రమ నిర్మాణాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోజూ ప్లానింగ్‌సెక్రటరీలు తమకు కేటాయించిన డివిజన్లలో పర్యటించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. త్వరలో రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టాల్సి ఉందన్నారు. టీపీవో శుభప్రద, తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.5లక్షల విరాళం

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానానికి శుక్రవారం కడపకు చెందిన గజ్జల దినేష్‌రెడ్డి రూ.5,00,116 విరాళంగా అందించారు. దాతను ఏఈవో రవీంద్రబాబు ఆహ్వానించి, దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును సక్సెస్ చేయండి: జగన్మోహన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో లక్ష మందితో పార్టీ సభ్యత్వ నమోదు చేయించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. నేతలు, కార్యకర్తలు కష్టించి పనిచేస్తే.. వారికి తగిన బహుమతులు, పదవులు వచ్చేలా కృషిచేస్తామని చెప్పారు.

అమెరికాలో భానుప్రకాష్‌కు ఘన స్వాగతం



నగరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు అమెరికా విమానాశ్రయంలో తెలుగువారు ఘనంగా స్వాగతం పలికారు. 10 రోజులపాటు అమెరికా పర్యటనకు వెళ్లిన ఆయన్ను టీడీపీకి చెందిన ప్రవాసాంధ్రులు సాదరంగా ఆహ్వానించారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించండి : కమిషనర్

నగరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని ఆక్రమణలను తొలగించాలని దుకాణదారులకు కమిషనర్ కృష్ణారెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. సిబ్బందితో కలిసి ప్రధానవీధులు, టవర్‌క్లాక్ కూడలిలో పర్యటించి.. రోడ్డు మార్జిన్‌లు ఆక్రమించిన వారికి సూచించారు. టీపీవో మూర్తి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.


← దుకాణదారులకు సూచనలిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

రేపు ఉచిత నేత్ర వైద్యశిబిరం

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాములగుడివీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు జైన్ సంఘం అధ్యక్షుడు సుభాష్‌జైన్ తెలిపారు. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల వైద్యుల సహకారంతో నిర్వహిస్తున్న శిబిరాన్ని నగరవాసులు సద్వినియోగం కోరారు.

కోదండరామాలయంలో 1నుంచి పవిత్రోత్సవాలు

చిత్తూరు కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో అత్యంత ప్రాశస్త్యం పొందిన కోదండరామాలయంలో నవంబరు 1 నుంచి 4వ తేదీవరకు స్వామివారి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకుడు వేణుగోపాల్ తెలిపారు.

ఈ కష్టం తప్పదా?

'వెంకటాద్రి' ఎక్కడానికి ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నుంచి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో ఈ రైలు మొదటి ప్లాట్‌ఫారం నుంచి బయల్దేరేది. తర్వాత రెండో ప్లాట్‌ఫారానికి మార్చారు. ప్రస్తుతం మూడో ప్లాట్‌ఫారం నుంచి సాయంత్రం 5.30 గంటలకు బయల్దేరుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడం వల్ల ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. మొదటి ప్లాట్‌ఫారం నుంచి పట్టాలు దాటుకుని మూడో నెంబరు ప్లాట్‌ఫారానికి వెళ్లాల్సి వస్తోంది. వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లలు.. ఆరడుగుల ఎత్తులో ఉన్న దిమ్మెను ఎక్కి, దిగాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ లగేజీలు ఉన్నవారు ఆర్టీసీ బస్టాండు వైపు నుంచి మూడో నెంబరు ప్లాట్‌ఫారం వద్దకు చేరుకుంటున్నారు. ఇటువంటి వారంతా తమ రైలు పెట్టెల వద్దకు చేరుకోవడానికి అర కిలోమీటరు దూరం నడవాల్సి వస్తోంది. గతంలో మాదిరిగా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం వద్ద పెడితే ఇబ్బందులు తప్పుతాయని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


పట్టాలను దాటుతున్న ప్రయాణికులు

వర్షపు నీటితో గ్రామాలు మునిగినా పట్టించుకోరా?

రైతులకు చెప్పకుండా సమావేశాలు ఎలా నిర్వహిస్తారు? : ఎమ్మెల్యే ఆగ్రహం


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

పూతలపట్టు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 'మీ నిర్లక్ష్యం కారణంగా వర్షాల వల్ల వచ్చే నీటితో గ్రామాలు మునిగిపోయినా పట్టించుకోరా..? రైతులకు సమాచారం ఇవ్వకుండా సమావేశాలను ఎలా నిర్వహిస్తారు?' అని నేషనల్ హైవే అధికారులపై ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం హైవే అధికారులు, రైతులతో ల్యాండ్ అక్విజేషన్‌పై సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేషనల్ హైవేపై వర్షపు నీరు పోయేందుకు డ్రైనేజీ కాలువలు నిర్మించకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. 15 ఏళ్లుగా పెంచుకున్న మామిడి, కొబ్బరి తోటలతో పాటు కోళ్లఫారం షెడ్లు నీటి మునిగి రైతులు నష్టపోయినా కూడా అధికారుల్లో చలనం లేదా అని మండిపడ్డారు. మండలంలోని పేట అగ్రహారం డ్రైనేజీ కాలువ లేనందున ఇళ్లల్లోకి నీళ్లు వస్తున్న విషయం మీకు తెలియదా అని నిలదీశారు. గ్రామస్తులు తిరుపతిలోని సంబంధిత పీడీ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం ఏమిటన్నారు. రోడ్డు నిర్మాణం జరిగే టప్పుడే డ్రైనేజీ కాలువలను నిర్మించి ఉంటేఇంత సమస్య వచ్చేది కాదన్నారు. పి.కొత్తకోట సమీపాన ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ల్యాండ్ అక్విజేషన్ విషయం చెప్పకుండా వందలాది మంది రైతులను తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించడం న్యాయమేనా అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ గుర్రప్ప, టీడీపీ మండల కన్వీనర్ దొరబాబుచౌదరి, పేట అగ్రహారం, కొత్తకోట పంచాయతీకి చెందిన రైతులు పాల్గొన్నారు.

హోంగార్డు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్


విద్యార్థినికి చెక్ అందజేస్తున్న ఎస్పీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు కార్యాలయంలో 18 మంది హోంగార్డు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ.. హోంగార్డుల పిల్లల విద్యకు ఆర్థికసాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, డీఎస్పీ మహబూబ్ బాష, ఎస్‌బీ సీఐ భాస్కర్, ఆర్ఐ సుధాకర్, ఎంటీవో భాస్కర్, హోంగార్డులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి స్థలమివ్వండి


తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న టీడీపీ నేతలు

గుడిపాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గుడిపాలలో టీడీపీ కార్యాలయానికి తగిన స్థలాన్ని కేటాయించాలని శుక్రవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిని పార్టీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నేత చెన్నకేశవులు నాయుడు, తదితరులు కోరారు. కొన్నేళ్లుగా టీడీపీ కార్యాలయం లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, మార్కెట్ ధరకు ఆరు సెంట్ల భూమిని కేటాయించాలని కోరారు. టీడీపీ నేతలు హేమాద్రి నాయుడు, అరుణ్, శంకర్ చౌదరి, కిట్టు, గుర్రప్పనాయుడు పాల్గొన్నారు.

పెనుమూరు యూటీఎఫ్ నూతన కార్యవర్గం


జానకిరామ్ - మధు

పెనుమూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలను పెనుమూరు ఎంఆర్‌సీలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి బాషా, జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.జానకిరామయ్య, ప్రధానకార్యదర్శి మధు, గౌరవాధ్యక్షుడిగా దేవేంద్రనాయుడు, కోశాధికారిగా మోహన్‌బాబు, మండల మహిళా ప్రధాన కార్యదర్శిగా మమత, సహాధ్యక్షులుగా శాంతి, నరసింహులు, కార్యవర్గ సభ్యులుగా తులసిరాం, రవి, కుమార్, గిరి, మీనా, హరికృష్ణ, రేణుక, అమరావతి, రేవతి, జిల్లా కార్యదర్శులుగా కోదండరెడ్డి, డిల్లీబాబు, చిట్టిబాబు, సీపీఎస్ కన్వీనర్‌గా రాజేంద్రలను ఎన్నుకున్నారు. మండలంలోని టీచర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో దసరా పూజ



ఐరాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఐరాలలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం దసరా పూజ జరిగింది. కార్యాలయ సిబ్బంది బదిలీపై కార్యాలయానికి విచ్చేయడంతో అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, ఎంపీడీవో ధనలక్ష్మి, తహసీల్దార్ మహేష్‌కుమార్, ఈవోపీఆర్డీ కుసుమకుమారి, ఏపీఎం సంధ్యారాణి, కూటమి నాయకులు హరిబాబునాయుడు, రాజేష్‌రెడ్డి, దేవాజి, లోకనాథరెడ్డి, రంజిత్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, దయానందమండడి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



నగరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగరాజకుప్పం ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న మమత,నీరజలు అండర్-17 బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభచూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 కబడ్డీ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని జ్యోష్న కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. వీరిని శుక్రవారం అభినందించారు. పీడీ చెన్నకేశవరెడ్డి, హెచ్‌ఎం మునిరత్నం పాల్గొన్నారు.

నిందితులకు 15 రోజుల రిమాండు

క్రైం కార్నర్

నగరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తడుకుపేటలోని ఓ ఇంట్లో సెల్‌ఫోన్లను చేసిన తమిళనాడుకు చెందిన వేలు(21), బాలచందర్ (21), విజయ్ కుమార్ (24)లను ఆ రాష్ట్ర సరిహద్దులోని పొన్‌పాడి చెక్‌పోస్టు వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి చోరీ చేసిన రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. నిందితులను శుక్రవారం ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ గోపాలకృష్ణ ముందు హాజరుపరచగా 15 రోజుల రిమాండ్ విధించారు. అలాగే అక్టోబరు ఒకటో తేదీన ఓజీకుప్పంలో రోడ్డుపై కనబడిన తమిళజంటను కత్తితో బెదిరించి డబ్బులు చోరీ చేసిన ఘటనలో అరక్కోణంకు చెందిన అజిత్, హుస్సేన్, రోహిత్‌లను అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరిచారు. వీరికీ 15 రోజుల రిమాండ్ విధించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం నగరంలోని జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. తేనబండ ధర్మరాజులగుడివీధికి చెందిన మురళీ(29) ఓ చికెన్‌షాపులో పనిచేసేవాడు. కుటుంబ అవసరాలకు కొందరి వద్ద అప్పులు తీసుకున్నాడు. తీర్చలేక పోవడంతో అప్పులు ఇచ్చిన వారినుంచి ఒత్తిడి రావడంతో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

1100 లీటర్ల సారా ఊట ధ్వంసం

శ్రీరంగరాజపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నతయ్యూరు గ్రామంలోని సారా స్థావరాలపై కార్వేటినగరం సిబ్బందితో కలసి చిత్తూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ పవన్ కుమార్ శుక్రవారం దాడి చేశారు. దాదాపు 1100 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు. సిబ్బంది సుబ్రహ్మణ్యం, దేవప్రసాద్, రాజేష్, తంజేష్, హేమాద్రి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ వాహనాల సీజ్

చిత్తూరు సిటీ, అక్టోబరు 25: ఓవర్ లోడ్‌తో వెళుతున్న వాహనాలను రవాణాశాఖ అధికారులు సీజ్ చేశారు. ఎంవీఐ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం రాత్రి చిత్తూరు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఓవర్ లోడ్‌తో వెలుతున్న గ్రానైట్ లారీని, మరో ఇనుప రాడ్‌ల లారీని సీజ్ చేసి రూ.1.38 లక్షల జరిమానా విధించారు.

విద్యార్థులకు సన్మానం



యాదమరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని తెలుగు యువత జిల్లా అధికారప్రతినిధి వల్లేరు అమర్‌నాథనాయుడు అన్నారు. శుక్రవారం రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన యాదమరి జడ్పీ హైస్కూల్ విద్యార్థులను సన్మానించారు. హెచ్‌ఎం గిరిరాజా, పీడీ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదమరి యూటీఎఫ్ అధ్యక్షుడిగా పార్థసారధి



యాదమరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల యూటీఎఫ్ కార్యవర్గాన్ని శుక్రవారం యాదమరి మండల పరిషత్ పాఠశాలలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, కార్యదర్శి మణికంఠ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా పార్థసారథి, ప్రధానకార్యదర్శిగా సర్దార్, అసోసియేట్ అధ్యక్షుడిగా సురేష్‌కుమార్, మహిళా అధ్యక్షురాలిగా జహరేనా, కోశాధికారిగా గిరిబాబు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్‌గా సుబ్రహ్మణ్యం, ఆడిట్ కమిటీ సభ్యుడిగా చిట్టిబాబు, కార్యదర్శులుగా మూర్తి, తులసి మునయ్య, జ్యోతి, శారద, లత, మణిని ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న గ్రామసభలు

గుడిపాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వసంతాపురం పంచాయతీ పశుమంద రెవెన్యూ గ్రామంలో సభను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈశ్వరికి చెందిన 2.47ఎకరాలకు 1.06 ఎకరాలు ఎక్కువగా నమోదైందని, సుబ్రహ్మణ్యంరెడ్డికి సంబంధించి 89 సెంట్లకుగాను 79 సెంట్లే నమోదైందని తెలిపారు. రీ సర్వే డీటీ రూపాదేవి, మండల సర్వేయర్లు గోపి, కిరణ్, సర్పంచ్ రజినికాంత్, మాజీ సర్పంచ్‌లు ప్రతాప్‌నాయుడు, రెడ్డెప్పరెడ్డి, టీడీపీనేత బాబురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలంలోని అన్నూరులో గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భగవతి, రీసర్వేడీటీ స్వరూపరాణి, సర్వేయర్ బాబు, వీఆర్వో గాయత్రి, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్


కార్వేటినగరంలో సూచనలిస్తున్న ఎస్ఈ

వెదురుకుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం కార్వేటినగరంలో వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, కార్వేటినగరం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో సమావేశమయ్యారు. అంగన్వాడీ కేంద్రాలకు మంజూరైన తాగునీటి సరఫరా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆవాసాల్లో తాగునీరు సరఫరాను మెరుగుపరచాలని సూచించారు. అతిసారం, విషజ్వరాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పైపులైన్లు లీకేజీ లేకుండా చూడాలన్నారు. లీకేజీలు ఉన్న ప్రాంతాల్లో ట్యాంకరు ద్వారా నీటి సరఫరా చేయించాలన్నారు. మంచినీటి ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేయించాలని, ఓహెచ్ఎస్ఆర్ నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేయాలన్నారు. ఈఈ నరేంద్రకుమార్, డీఈఈ ఎంఆర్ సతీష్‌కుమార్, ఏఈఈ కె.గిరీష్ (కార్వేటినగరం), ఎస్.కుమారస్వామి(ఎస్ఆర్‌పురం), కె.గాయత్రి(వెదురుకుప్పం) పాల్గొన్నారు. కాగా,కార్వేటినగరం మండలంలోని సురేంద్రనగరం గ్రామ పంచాయతీ పరిధిలోని దాసరికండ్రిగ అంగన్వాడీ కేంద్రంలోని తాగునీటి సరఫరాను ఎస్ఈ తనిఖీ చేశారు.

సంక్షిప్తంగా..

వ్యవసాయ పరికరాల పంపిణీ

వెదురుకుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో శనివారం ఉదయం పది గంటలకు వ్యవసాయ అనుబంధ పరికరాలను ఎమ్మెల్యే థామస్ పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు.

ద్రౌపది అమ్మవారికి పూజలు

వెదురుకుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ద్రౌపది అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

కాలువల పరిశీలన

పూతలపట్టు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోటుకనుమ గ్రామంలో నిర్మించిన డ్రైనేజీ కాలువలను శుక్రవారం ఎంపీడీవో నాగరాజు పరిశీలించారు. గ్రామ ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా ఉండాలంటే పంచాయతీ అధికారులు పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. సర్పంచ్ బాబు నాయుడు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

నగరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని సాల్వపట్టెడలో ప్రాథమిక పాఠశాలను ఎంఈవో శ్రీదేవి శుక్రవారం తనిఖీ చేశారు. సెకండ్ ఎంఈవో నమశ్శివాయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

నగరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు తెలిపారు. నగరి నియోజకవర్గంలోని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల సమావేశం షబ్బీర్ బాషా అధ్యక్షతన శుక్రవారం జరిగింది. వేలన్, షబ్బీర్ బాషా, విజయకుమార్, మురళి, హంస, నగోమి, శేఖర్, రాజేంద్ర, సతీష్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

పాలసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం తిరుమలరాజుపురం, నరసింహాపురం సచివాలయాలను తనిఖీ చేశారు. ఈవోపీఆర్డీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బందికి సన్మానం

వెదురుకుప్పం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న, బదిలీపై ఇక్కడికొచ్చిన వచ్చిన బోధనేతర సిబ్బందిని హెచ్‌ఎం కేశవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సత్కారం

పాలసముద్రం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పాలసముద్రం ఎస్ఐ భారతి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. శుక్రవారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించి, ఎస్ఐని సన్మానించారు. ఏఎస్ఐ రవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పరిశీలన

శ్రీరంగరాజపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెదవాడ పంచాయతీ మర్రిపల్లె అంగన్వాడీ కేంద్రానికి వేస్తున్న నూతన పైప్‌లైన్‌ను గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుధ్య ఈఈ నరేంద్ర కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఏఈ కుమార్‌స్వామి, సర్పంచ్ ఉమామహేశ్వరి, ఆనంద్ పాల్గొన్నారు.

గైర్హాజరుపై టీచర్‌కు నోటీసు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): విధులకు అనధికారికంగా గైర్హాజరైన బైరెడ్డిపల్లె మండలం ఎంపీపీ పాఠశాల లక్కనపల్లి ఎస్టీటీ టీచర్‌గా పనిచేస్తున్న ఎస్.అరుణకుమారికి డీఈవో దేవరాజు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. 2023 జూన్ 31 నుంచి పాఠశాలకు అనధికారికంగా గైర్హాజరైన ఆమెను వివరణ కోరుతూ.. ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఇచ్చారు. డీఈవోను నేరుగా కలిసి వివరణ ఇవ్వాలన్నారు.

మాదకద్రవ్యాలపై సదస్సు

వెదురుకుప్పం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా విజయలురెడ్డి, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో-ఆర్డినేటరు ప్రదీప్, క్రాస్ సంస్థ డైరెక్టర్ భూపతి, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయులురెడ్డి పాల్గొన్నారు.